క్లుప్తంగా

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



బహుమతులు అందజేస్తున్న హీరో సుమన్

కొత్తగూడెంటౌన్: ఈనెల 5న ఖమ్మంలో జరిగిన జాతీయస్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు ప్రతిభ చూపారని కోచ్ పెదపాటి నిహారిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల కటాస్ విభాగంలో ఎంఏ సనా, ఎంఏ ఆయాన్, కె.లికిత్, సీహెచ్ అజయ్ బంగారు పతకాలు, ఎల్ హర్షిత్, సీహెచ్ వెండి పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. అనంతరం విజేతలకు సినిమా హీరో సీనియర్ కరాటే మాస్టర్ సుమన్ బహుమతులు అందజేసినట్లు తెలిపారు.

వేతనాలు ఇవ్వండి

కొత్తగగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో పని చేస్తున్న కార్మికులకు సెప్టెంబర్, అక్టోబర్ వేతనాలు ఇవ్వాలని పారిశుద్ధ్య కార్మికులు మెడికల్ కళాశాల ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అంతేకాకుండా ప్రతీ ఒక్కరికి రూ.12 వేలు ఇవ్వాల్సింది రూ.11 వేలే ఇస్తున్నారని, పీఎఫ్ రూ.మూడు వేలకు బదులు వెయ్యి రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి.వీరన్న మాట్లాడుతూ.. కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎక్కువ మంది కార్మికులతో చేయించాల్సిన పనులు తక్కువ మందితో పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు నవీన్ గంగా, రమేష్, రాము, జయమ్మ, నర్సమ్మ, మల్లేశ్వరి కుమారి, వీరస్వామి ఉన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



త్రివేణి పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలో విద్యార్థులు

కొత్తగూడెంరూరల్: భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ జన్మదినం సందర్భంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని లక్ష్మీదేవిపల్లి మండలంలోని త్రివేణి పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌సింగ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల మధ్యలో సీవీ రామన్ జన్మదినాన్ని జరుపుకోవటం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. త్రివేణి విద్యా సంస్థల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరి, గొల్లపూడి జగదీశ్, సీఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ వైవీ సురేష్ ఉన్నారు.

కేన్సర్ వ్యాధిపై అవగాహన ఉండాలి

కొత్తగూడెంఅర్బన్: కేన్సర్ వ్యాధిపై ప్రతీఒక్కరికి అవగహన ఉండాలని డాక్టర్ మాధవ్‌వరుణ్ అన్నారు. మంగళవారం స్థానిక పాతకొత్తగూడెంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ కేన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రాథమిక చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ మాధవ్‌వరుణ్ మాట్లాడుతూ.. కేన్సర్ వ్యాధి ఎలా వస్తుంది, ఎలా తెలుసుకోవాలి, చికిత్స మార్గాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ బి.రాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ యశోద, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ



దుస్తులు అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంరూరల్/కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ కాలనీ పంచాయతీ ఇందిరానగర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు వాసవి క్లబ్ కొత్తగూడెం, వాసవి క్లబ్ వనిత విజయం కొత్తగూడెం ఆధ్వర్యంలో 115 మంది విద్యార్థులకు దీపావళి సందర్భంగా నూతన దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం వాసవి క్లబ్ అధ్యక్షుడు శ్రీమకుర్తి రాజమనోహర్, వాసవి క్లబ్ వనిత విజయం కొత్తగూడెం అధ్యక్షుడు వందనపు శ్రీలక్ష్మి, సెక్రెటరీ బౌరిషెట్టి శైలజ, గుబ్బభార్గవి, వందనపు లక్ష్మీ, రామరావు, చెక్క ఫణీంద్ర, హెచ్‌ఎం జ్యోతిరాణి తదితరులు పాల్గొన్నారు.



బయ్యారంలోని ఐరన్ ఓర్ గుట్ట





బయ్యారం పెద్ద చెరువు, తులారం ప్రాజెక్టు




సర్వమత ప్రార్థనలకు నిలయమైన సత్యనారాయణపురం నాగుల్ మీరా దర్గాలో జులూస్ (ఫైల్)

భౌగోళిక 'చిత్రం'

పూర్వవైభవం కోల్పోయిన ఇల్లెందు నియోజకవర్గం

- చేజారిన కల్పతరువు బయ్యారం పెద్ద చెరువు
- దక్కని తులారం, మున్నేరు ప్రాజెక్టులు
- ఘాటైన కామేపల్లి మిర్చి ప్రతిఫలం ఖమ్మం జిల్లాలోకి..
- నియోజకవర్గం ముక్కలు.. దూరమైన ఉద్యోగాలు, ఉపాధి



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జిల్లాల పునర్విభజన జరిగింది. ఇందులో భాగంగా భద్రాద్రి జిల్లాలోని ఇల్లెందు నియోజకవర్గం ముక్కలు చెక్కలైంది.. అసెంబ్లీ నియోజకవర్గ పరిధి మూడు జిల్లాలకు విస్తరించింది. ఇల్లెందు, టేకులపల్లి, భద్రాద్రి కొత్తగూడెం... కామేపల్లి ఖమ్మం.. బయ్యారం, గార్ల మండలాలు మహబూబాబాద్ జిల్లాల్లోకి వెళ్లాయి. కాగా ఇక్కడ ప్రాతినిధ్యం వహించే ఎమ్మెల్యేకు ఆయా మూడు జిల్లాల్లో ప్రొటోకాల్ దక్కింది.

ఇల్లెందు: జిల్లాల విభజనతో మూడు ముక్కలైన ఇల్లెందు నియోజకవర్గం పూర్వ వైభవం కోల్పోయింది. ఉద్యమాల ఖిల్లాగా పేరొందిన ఇల్లెందు పాలకులు మారినా దాని తలరాత మారని దుస్థితి నెలకొంది. ఖనిజ సంపదకు నిలయమైన ఇల్లెందులో నల్లబంగారం, మార్బుల్, బైరటీస్, ఐరన్‌ఓర్, డోలమైట్, లేటరైట్ లాంటి విలువైన ఖనిజాలు నిక్షిప్తమై ఉన్నాయి. ఒకనాడు 'బయ్యారం ఉక్కు- తెలంగాణ హక్కు' అని నినదించిన ఇల్లెందు నియోజకవర్గ ప్రజలకు విశాలమైన భూభాగంలో ఆవరించి ఉన్న ఖనిజ సంపద దక్కని దుస్థితి. సుమారు 10 వేల ఎకరాలకుపైగా ఒకే చెరువు కింద నీటి సదుపాయం కల్పించగలిగితే రెండు పంటలు పండే వరి ధాన్యం గోడౌన్, బయ్యారం పెద్ద చెరువు, తులారం ఫలాలు ఇక్కడి ప్రజలకు అందని ద్రాక్షలా మారాయి. కామేపల్లి మండలంలో అత్యధికంగా సాగయ్యే మిర్చి ఖమ్మం జిల్లాకు సొంతంగా మారింది. ఇలా ఎన్ని వనరులు ఉన్నా అన్నీ అందని ద్రాక్షలా మారాయి..

మారిన స్వరూపం...

1952 నుంచి 1971 వరకు ఇల్లెందు నియోజకవర్గం ద్విసభ్య నియోజకవర్గంగా ఉంది. 1972 నుంచి 1977 వరకు జనరల్ అసెంబ్లీ స్థానంగా ఉంది. ఇక 1978లో ఎస్టీలకు రిజర్వ్ చేశారు. అప్పుడు ఈ నియోజకవర్గం ఇల్లెందు, టేకులపల్లి, గార్ల, బయ్యారం, గుండాల, కారేపల్లి, పినపాక మండలాల్లో కొంతభాగం ఇల్లెందు నియోజకవర్గంగా ఉండేది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో నియోజకవర్గాన్ని చీల్చేశారు. ఇల్లెందు, టేకులపల్లి, గార్ల, బయ్యారం కామేపల్లి మండలాలతో ఇల్లెందు నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. గుండాల మండలాన్ని పినపాకలో కారేపల్లి మండలాన్ని వైరాలో కలిపారు.

ముక్కలైన ఇల్లెందు నియోజకవర్గం..

2014లో తెలంగాణ రాష్ట్ర అవిర్భావం తర్వాత 2015లో జిల్లాల పునర్విభజన జరిగింది. దీంతో ఇల్లెందు నియోజకవర్గం పూర్వవైభవం కోల్పోయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇల్లెందు, టేకులపల్లి మండలాలు, మహబూబాబాద్ జిల్లాలో బయ్యారం, గార్ల మండలాలు, ఖమ్మం జిల్లాలో కామేపల్లి మండలం ఇలా ముక్కలు చెక్కలైంది. ఖనిజ సంపద, మిర్చి, ధాన్య బాంఢాగారానికి నెలవైన చెరువులు, ప్రాజెక్టులు కోల్పోయి నియోజకవర్గం తీవ్రంగా నష్టపోయింది. ఉద్యోగ, ఉపాధి రంగాలను కోల్పోయింది.

ఇప్పటికే క్రమంగా సింగరేణి బొగ్గు గనులను కోల్పోయింది. ఒకనాడు 14 బావులతో 20 వేల మంది కార్మికులతో కళకళలాడిన ఇల్లెందు నేడు కేవలం వెయ్యిమంది లోపు కార్మికులతో కళాహీనంగా మారింది. బయ్యారం మండలంలో 5,400 హెక్టార్లలో విస్తరించి ఉన్న ఐరన్‌ఓర్, గార్ల బైరటీస్‌ను సద్వినియోగం చేసుకునేందుకు ఇక్కడే ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల మంది స్థానిక నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. కానీ అవేమీ జరకపోవడంతో నిరుద్యోగుల ఆశలు ఆడియాశలుగానే మిగిలిపోతున్నాయి.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కనకయ్య

ఇల్లెందురూరల్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని జెడ్పీ చైర్మన్, కాంగ్రెస్ అసెంబ్లీ అభ్యర్థి కోరం కనకయ్య అన్నారు. మండలంలోని కొమరారం ఉమ్మడి గ్రామపంచాయతీ పరిధిలో బీఆర్‌ఎస్ నుంచి భారీ సంఖ్యలో మంగళవారం రాత్రి కోరం కనకయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధినాయకత్వం ప్రకటించిన ఐరు గ్యారెంటీలను ప్రజలు నిశితంగా పరిశీలించి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ ప్రాంతంలో అనేక అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. ఆనాడు తాను సర్వే చేయించి ప్రతిపాదనలు సిద్ధం చేసిన పనులు ఆ తరువాత మంజూరుకు నోచుకున్నాయని గుర్తుచేశారు. పార్టీలో చేరిన వారిలో నాగేశ్వరరావు, మంచె రమేష్, వంకుడోత్ శ్రీనివాస్, జగదీష్, రాంజీ, జోగ కృష్ణ, రాందాస్, జర్పుల బాబులాల్, కొమ్ము రామస్వామి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు పులి సైదులు, మండల రాము, పూనెం సురేందర్, సూర్నపాక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవకాశవాద రాజకీయాలను నమ్మొద్దు



ప్రచారం చేస్తున్న కామేశ్

కొత్తగూడెంఅర్బన్: అవకాశవాద డబ్బు రాజకీయాలను నియోజకవర్గ ఓటర్లు తిప్పికొట్టాలని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి, అడ్వకేట్ యెర్రా కామేశ్ కోరారు. మంగళవారం మన కొత్తగూడెం-మన కామేష్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 12, 23, 24వ వార్డులలో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. ఈనెల 30న జరగనున్న ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గంలో డబ్బు, అహంకారం ఒక వైపు, స్వచ్ఛమైన నీతివంతమైన రాజకీయాలు మరోవైపు మధ్య పోటీ జరుగుతోందన్నారు. ప్రజలు ప్రస్తుత రాజకీయ సమీకరణాలు, మార్పులను నిశితంగా పరిశీలిస్తూ భావి భవిష్యత్‌ను నిర్దేశించడంలో చైతన్యవంతంగా ఆలోచించాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అనేక ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చి వాటి పరిష్కారానికి బీఎస్పీ నిరంతరం ఉద్యమించిందని తెలిపారు. స్వచ్ఛమైన రాజకీయాలను స్వాగతించేలా ఏనుగు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జున్ రావు, సాయి, నాగుల రవికుమార్, గుడివాడ రాజేందర్, ఎడెల్లి మర్థమ్మ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా బీఎస్పీ ఎన్నికల బరిలో నిలిచిందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాదావత్ ప్రతాప్‌సింగ్ నాయక్ అన్నారు. మండలంలోని పలు గ్రామపంచాయతీలలో మంగళవారం బీఎస్పీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బహుజన సిద్ధాంతాన్ని, బీఎస్పీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల్లో బీఎస్పీని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఎస్పీ ఇల్లెందు ఎమ్మెల్యే అభ్యర్థిని పార్టీ నాయకత్వం త్వరలో ప్రకటిస్తుందని చెప్పారు. పార్టీ ఎవరికి అవకాశం కల్పించినా బీఎస్పీ విజయం కోసమే పనిచేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంతారావు, గోపీనాథ్, శేఖర్, మంగీలాల్, కాశీరాం, శంకర్, వినోద్, నాగేశ్వరరావు, రాజేష్, లోకేష్, కిరణ్, సాయి, రామారావు, తరుణ్ పాల్గొన్నారు.

ఎన్డీ అభ్యర్థిని గెలిపించండి..



మాట్లాడుతున్న సీతారామయ్య

టేకులపల్లి: శాసనసభ ఎన్నికలలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఇల్లెందు ఎమ్మెల్యే అభ్యర్థి మోకాళ్ల కృష్ణ విజయాన్ని కాంక్షిస్తూ టేకులపల్లిలో 9వ తేదీన మండల ఎన్నికల సదస్సు నిర్వహిస్తున్నట్లు విజయవంతం చేయాలని అసెంబ్లీ నియోజకవర్గ కోకన్వీనర్ జే.సీతారామయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లి మండల కేంద్రంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రెండు పార్టీల ఉమ్మడి సమావేశం డి.ప్రసాద్, నర్సింగుల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇల్లెందు అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ పడుతున్న బీఆర్‌ఎస్, కాంగ్రెసు, బీజేపీ పార్టీలు ప్రజా వ్యతిరేక విధానాలను, అభివృద్ధి నిరోధక విధానాలను అనుసరిస్తున్నాయని, అడ్డూ అదుపూ లేకుండా అవినీతికి పాల్పడుతున్నాయని, ప్రజలను కులం, మతం పేరుతో విభజన చేసి విచ్ఛిన్నం చేస్తున్నాయని విమర్శించారు. అందుకే వారిని ఓడించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు కల్తీ వెంకటేశ్వర్లు, నోముల భానుచందర్, భూక్యా హరిజ, ఎల్. విశ్వనాథం, ఎండీ రాసుద్దీన్, బి.రామ్‌సింగ్, ధరావత్ వెంకన్న, పెనక రామస్వామి, టి.సతీష్ ఏ.సాంబ, జే.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలిరావాలి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ బలపరిచి సీపీఐ అభ్యర్థిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు బుధవారం నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం షాపులలో ఆహ్వాన పత్రాలను పంపిణీ చేశారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

టేకులపల్లి: మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కాలె ప్రసాదరావు పార్టీకి రాజీనామా చేశారు. ఈమేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల టేకులపల్లిలో జరిగిన బీఆర్‌ఎస్ సర్వసభ్య సమావేశానికి పెద్దసంఖ్యలో దళితులు హాజరయ్యారని తెలిపారు. కానీ ఒక్క దళిత నాయకుడిని కూడా వేదికపైకి పిలవకుండా అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాటి నుంచి పార్టీకి దూరంగా ఉంటున్న తాను రాజీనామా చేసినట్లు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

సుజాతనగర్: వ్యక్తి అదృశ్యంంపై పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింహాసాగర్ గ్రామానికి చెందిన లావుడ్యా కుమార్ ఈ నెల 4న కూరగాయలు తెస్తానని ఇంట్లో చెప్పి ద్విచక్రవాహనంపై కొత్తగూడెం వెళ్లాడు. కానీ తిరిగి రాలేదు. ఆదేరోజు కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్‌లో బైక్ పార్కింగ్ చేసినట్లుగా కుటుంబసభ్యులు గుర్తించారు. ఎక్కడ వెతికినీ ఆచూకీ లభించలేదు. దీంతో భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సోమేశ్వర్ తెలిపారు.

పాఠశాలల సందర్శన

జూలూరుపాడు: జూలూరుపాడు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని వినోభానగర్, అనంతారం, గాంధీనగర్, వెంగన్నపాలెం, జూలూరుపాడు కోయకాలనీ ప్రభుత్వ పాఠశాలలను జూలూరుపాడు స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా తొలిమెట్టు కార్యక్రమ అమలు తీరుతెన్నులను పరిశీలించారు. అదేవిధంగా తరగతుల వారీగా తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, మెనూ అమలు తీరును వర్కర్లను అడిగి తెలుసుకున్నారు.

భారీ వర్షం..

జూలూరుపాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండలంలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై సాయంత్రం పెద్ద వాన కురిసింది. మూడు నెలలుగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పంటలు ఎండిపోతున్న తరుణంలో వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వరి, పత్తి పంటలు చేతికి వచ్చే సమయంలో వాన కురిస్తే పంట నష్టం జరుగుతుందని రైతులను ఆవేదన చెందుతున్నారు.

నాలుగో రోజు పలువురు నామినేషన్లు



హరిప్రియ తరపున నామినేషన్ అందజేస్తున్న నాయకులు



కాంగ్రెస్ నాయకుడు నామోదర్ నాయక్, బీజేపీ అభ్యర్థి రవీంద్ర నాయక్ తరపున గోపీకృష్ణ..

ఇల్లెందు: ఎన్నికల నామినేషన్ల పర్వం నాలుగో రోజు పలువురు తమ నామినేషన్లను దాఖలు చేశారు. మంగళవారం అసెంబ్లీ ఎన్నికల అధికారి కాశయ్యకు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య రెండో సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అధికార బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే హరిప్రియ తరపున మాజీ మార్కెట్ చైర్మన్ హరిసింగ్ నాయక్, గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు నామినేషన్ పత్రాలు సమర్పించారు. బీజేపీ అభ్యర్థి డి.రవీంద్ర నాయక్ తరుపున ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలగాని గోపీకృష్ణ నామినేషన్ దాఖలు చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ జి.రవి, నామోదర్ నాయక్, మండల్ విద్యార్థుల రాజకీయ పార్టీ తరుపున లకావత్ ప్రసాద్ నామినేషన్ సమర్పించారు.

సీపీఐ అభ్యర్థికి సహకరించం..



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పాల్వంచ: కొత్తగూడెం నియోజకవర్గ కాంగ్రెస్ సీటు పొత్తులో భాగంగా సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావుకు కేటాయించడంతో కాంగ్రెస్ నేతలు అసంతృప్తి వెళ్లకక్కుతున్నారు. ఇంతకాలం కాంగ్రెస్‌లో పనిచేసిన మేము సీపీఐకి సహకరించేది లేదని భీష్మించుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ప్రశాంత్ కాలనీలోని కాంగ్రెస్ నాయకులు తుమ్మల శివారెడ్డి గృహంలో పలువురు కాంగ్రెస్ నేతలు సమావేశమై సీపీఐకి కేటాయించిన విషయంపై భగ్గుమన్నారు. పలువులు సీనియర్ నాయకులు మాట్లాడుతూ.. సీపీఐ అభ్యర్థికి ఇవ్వడం వల్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి బలపడే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ నుంచి పలువురు నేతలు పోటీలో ఉండగా ఏ ఒక్కరినీ కాదని కమ్యూనిస్టు నేతకు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధిష్టానం, పీసీసీ నేతలు ఇప్పటికైనా బీఫాంను కాంగ్రెస్ అభ్యర్థికే ఇవ్వాలని, లేదంటే తమ భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. సీపీఐ అభ్యర్థికి డిపాజిట్ కూడా దక్కదన్నారు. జాలె జానకిరెడ్డి, బాలినేని నాగేశ్వరరావు, వెంకన్న గౌడ్, పెంకి శ్రీను, జీవన్ రెడ్డి, శివ, వెంకటరెడ్డి, శశి, ప్రభాకర్ పాల్గొన్నారు.

'విశ్వరూప'ను విజయవంతం చేయాలి



సుజాతనగర్: కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

సుజాతనగర్: మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నవంబర్ 11న హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని వికలాంగుల జాతీయ మహిళా అధ్యక్షురాలు సామినేని భవానీ చౌదరి పిలుపునిచ్చారు. సభకు వాల్‌పోస్టర్లను సింగభూపాలెం గ్రామంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్సీలలో ఉండే 59 ఉపకులాలకు విద్య, ఉద్యోగ, సంక్షేమ, రాజకీయంలో జనాభా దామాషా ప్రకారం సమాన వాటా దక్కాలంటే ఎస్సీ వర్గీకరణ జరగాలన్నారు. ఈ మహాసభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వస్తున్నందున మన జాతి ఆవేదనను చాటి చెప్పాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. లక్షలాదిగా తరలివచ్చి మహాసభకు విజయవంతం చేయాలని కోరారు. దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుట్టి నరేష్, దామెర్ల సర్వేశ్వరరావు, పాల్వంచ మండల అధ్యక్షులు డి.ప్రభాకర్, ఎమ్మార్పీఎస్ నాయకులు పి.బుజ్జిబాబు, ఉప్పలయ్య, అవినాష్, క్రాంతి, గాజుల నర్సింహారావు పాల్గొన్నారు.

టేకులపల్లి: ఈ నెల 11న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగే మాదిగలు, ఉపకులాల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ అలవాల రాజా పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు పంచుతూ ముత్యాలంపాడు, బేతంపూడి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మెంతెన ప్రభాకర్, కోట రవి, రఘు, వల్లభ ఉస్మానీలు, శంకర్, రాము, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'కారు' దిగనున్న ప్రజాప్రతినిధులు?

జూలూరుపాడు: మండల వ్యాప్తంగా పలువురు బీఆర్‌ఎస్ ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులు అసంతృప్తితో ఉన్నారు. సముచిత స్థానం దక్కడం లేదని, పార్టీలో ప్రయోజనం లేకుండా పోయిందని, సభలు, సమావేశాలకు ఆహ్వానించడం లేదని, మాగోడు పట్టించుకునే నాథుడే లేడని అసంతృప్తితో ఉన్నారు. పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వేర్వేరుగా సమావేశమై కారు దిగేందుకు సిద్ధమయ్యారు. మండలంలో రోజురోజుకు రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. వైరా ఎమ్మెల్యే స్థానాన్ని సీపీఎంకు కేటాయిస్తారా? లేదా కాంగ్రెస్ పోటీ చేస్తుందా? లేదా సందిగ్ధంలో ఉండటంతో బీఆర్‌ఎస్ నేతలు, ప్రజాప్రతినిధులు పార్టీని వీడేందుకు వెనకంజ వేశారు. కాంగ్రెస్ మూడో జాబితాలో వైరా ఎమ్మెల్యే కాంగ్రెస్ అభ్యర్థిగా మాలోత్ రాందాస్ నాయక్ పేరును కాంగ్రెస్ అధిష్టానం రాత్రి ప్రకటించడంతో రాజకీయ సమీకరణాలు మరింత వేగంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో పలువురు బీఆర్‌ఎస్ అసంతృప్త నేతలు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జూలూరుపాడులోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కోచైర్మన్, పాలేరు ఎమ్మెల్యే అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో పలువురు నేతలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు.

అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటాం



మాట్లాడుతున్న లాల్‌సింగ్ నాయక్

సుజాతనగర్: కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి కొత్తగూడెం నియోజకవర్గంలో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు గెలుపు కోసం కృషి చేస్తామని జిల్లా కాంగ్రెస్ నాయకులు లాల్‌సింగ్ నాయక్ అన్నారు. సుజాతనగర్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దేశ్యంతోనే సీపీఐతో కలిసి పనిచేసేందుకు కాంగ్రెస్ పార్టీ ముందుకొచ్చిందన్నారు. మాజీ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కాంగ్రెస్ బలచిన అభ్యర్థిగా ప్రకటించిందనీ.. దీంతో ఆయన గెలుపు నల్లేరుపై నడకేనన్నారు. బీఆర్‌ఎస్ పాలనతో నియోజకవర్గ ప్రజలు విసుగు చెంది మార్పును కోరుకుంటున్నారని తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి నాయకులంతా ఏకాభిప్రాయంతో పొత్తు ధర్మాన్ని పాటిస్తూ కూనంనేని గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థికి టికెట్ రాకపోవడంతో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడతామని సోషల్ మీడియాలో వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మొద్దన్నారు. అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తామని స్పష్టం చేశారు. గరీబ్‌పేట ఎంపీటీసీ కస్నబోయిన భద్రం, ఉపసర్పంచి శ్రీనివాసరావు, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు మనోజ్‌కుమార్ ఓబీసీ వైస్ చైర్మన్ సంగయాలాద్రి నాయకులు గుమ్మడి విజయ్, శ్రీనివాస్, కిరణ్, నరేష్, సంతు రాజేష్ పాల్గొన్నారు.

'ప్రగతికి తొలిమెట్టు ప్రశ్న' పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: జనవిజ్ఞాన వేదిక జిల్లా వారి అధ్వర్యంలో జాతీయ శాస్త్రీయ దృక్పథ ప్రచారోద్యమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రగతికి తొలి మెట్టు ప్రశ్న పోస్టర్లను సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ కుమారస్వామి చేత మంగళవారం ఆవిష్కరింపజేశారు. అనంతరం కొత్తగూడెం సింగరేణి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ శారద, చుంచుపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు వసంతలక్ష్మి చేత కూడా ఆవిష్కరింపజేశారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ జయంతి, శాస్త్రవేత్త మేరీక్యూరీ రెండో నోబెల్ ప్రైజ్ తీసుకున్న రోజైన నవంబరు 7న సైన్స్ ప్రచార ఉద్యమం నిర్వహించాలని జనవిజ్ఞాన వేదిక నిర్ణయించి పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎ.కస్తూరి, ఆర్.వెంకటేశ్వరరావు, ఎం.మోహన్‌రావు, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.